కథ

# అపార్థం

ఆర్.వి.చలపతి

విశ్వనాథ్ ఆఫీసుకు వచ్చి తన సీట్లో కూర్చోబోతుండగా సెల్‌ఫోన్ మ్రోగింది.

మళ్లీ కుటుంబరావు దగ్గరినుండే!

ఉదయాన్నుంచీ ఇది నాలుగవసారి.

'సరే.. ఏమంటాడో విందాం' అనుకొని "హలో" అన్నాడు.

"విశ్వం! ఉదయాన్నుంచీ ప్రయత్నం చేస్తున్నాను. ఇప్పటికి పలికావు. నీతో మాట్లాడాలి" అన్నాడు అవతలివైపు నుండి కుటుంబరావు.

"మాట్లాడు"

"ఇలా కాదు. నేరుగా మాట్లాడాలి. మా ఇంటికి రాగలవా చెప్పు. లేదంటే నిన్ను ఎప్పుడు ఎక్కడ కలవాలో అదైనా చెప్పు"

"నేను ఇప్పుడు తీరికగా లేను. సాయంత్రం తిరిగి ఫోన్ చెయ్యి" అని చెప్పి కట్ చేశాడు విశ్వనాథ్.

ఇలాంటి పిలుపేదో వస్తుందని రెండు రోజులుగా అనుకుంటూనే ఉన్నాడు. అయితే దానికి ఏం సమాధానం చెప్పాలో ఇంకా ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాడు. ఆఫీసులో కూర్చున్నా, ఇంట్లో ఉన్నా, రోడ్డుపై నడుస్తూ ఉన్నా అదే ఆలోచన.

రెండు రోజుల క్రితం విశ్వనాథ్ ఇంటికి తిరిగి వెళ్తూన్నప్పుడు అతని కొడుకు రాఘవ ఒక హోటల్లోంచి వెలుపలికి వస్తూ కనిపించాడు. పక్కన ఒక యువతి. ఆ అమ్మాయిని ఎక్కడో చూశానే అనుకుంటూండగానే గుర్తుకొచ్చింది. కుటుంబరావు కూతురు జలజ ఆ అమ్మాయి.

రాఘవ తండ్రిని చూశాడు. కానీ విశ్వనాథ్ మాత్రం వాళ్లను చూడనట్టు వెళ్లిపోయాడు.

రాఘవ్, జలజ ఇద్దరూ ఒకే చోట ఉద్యోగం చేస్తున్నారు. అందువలన ఇద్దరికీ బాగానే పరిచయం ఉండవచ్చు. కానీ కలిసి హోటల్‌కు వెళ్లేటంత సాన్నిహిత్యం ఉంటుందా? ఇద్దరు స్త్రీ, పురుషుల మధ్యా. ఒక్కచోట పనిచేస్తే మాత్రం!

విశ్వనాథ్‌కు రకరకాల సందేహాలు కలిగాయి. అయినా నోరు తెరచి రాఘవను అడగలేదు.

కుటుంబరావు కూడా విశ్వనాథ్‌తో బాటే పనిచేసేవాడు. కాకుంటే ఏడాది కిందటే రిటైరయిపోయాడు. అందువలన విశ్వనాథ్‌కు అతని గురించి బాగా తెలుసు. ముఖ్యంగా పిల్లల పెళ్లిళ్ల విషయంలో తమ కొలీగ్స్ మధ్య చర్చ వచ్చినప్పుడు కుటుంబరావు కూడా తన అభిప్రాయాలను తెలుపుతుండేవాడు. అతను కట్నం తీసుకోవడాన్ని, ఇవ్వడాన్ని కూడా పూర్తిగా వ్యతిరేకించేవాడు. అతనికి జలజ కాక మరో కొడుకు కూడా ఉన్నాడు. ఆ అబ్బాయి పేరు సుధాకర్. మంచి పేరు పొందిన కంపెనీలో మంచి హోదా గల ఉద్యోగంలో ఉన్నాడు.

"మీ అబ్బాయికి కట్నం తీసుకోకుండా మీ అమ్మాయి పెళ్లి ఎలా చేస్తావు?" అని అడిగితే-

"చెప్పానుగా! కట్నం తీసుకునేవాడికి మా అమ్మాయిని ఇచ్చి పెళ్లి చేయనుగాక చేయను. అందువలన మా అబ్బాయికి కట్నం అడిగే ప్రసక్తే లేదు" అని తెగేసి చెప్పేవాడు కుటుంబరావు.

అది తలుచుకునే ఇప్పుడు విశ్వనాథ్ సతమతమవుతూ ఉన్నది. కుటుంబరావు పెద్దగా స్థితిమంతుడు కాకున్నా అతనికి పెద్దగా అప్పులూ అవీ లేవు. పైగా పెద్దల మూలంగా వచ్చిన సొంత ఇల్లూ, బ్యాంకులో కాస్తో కూస్తో నగదూ ఉన్నాయి. అతను కట్నం తీసుకోకుండా కొడుక్కి పెళ్లి చేయగలడు. కట్నం ఇవ్వకుండా కూతురికి తగిన సంబంధమూ చూడగలడు. తన విషయం అలా కాదే! తనకు మాలతి కాక శాంతి అని మరో కూతురు కూడా ఉంది. సొంత ఇల్లంటూ లేదు. అప్పోసప్పో చేసి ఒక కూతురికి పెళ్లి చేయగలడు. ఇద్దరికీ కట్నం ఇచ్చి పెళ్లి చేయాలంటే తన కొడుకు పెళ్లికి కట్నం తీసుకోక తప్పదు.

ఇలాంటి పరిస్థితుల్లో కొడుకు రాఘవ ఆ అమ్మాయి జలజతో ప్రేమలో పడి ఆమెనే పెళ్లి చేసుకుంటానని పట్టు పడితే తను ఇబ్బందిలో పడతాడు. కులం, గోత్రం విషయంలో ఏమీ ఇబ్బంది లేదు గానీ కుటుంబరావు నుండి రూపాయి కట్నం కూడా ఎదురుచూడలేదే! ఉన్న ఒక్క కొడుక్కీ కట్నం తీసుకుంటే తన ఇద్దరు కూతుళ్ల గతి ఏమిటి?

రాఘవ విషయం తనకు తెలుసు. ఏ విషయమైనా తనతో జంకు లేకుండా చర్చిస్తాడు. అయితే ఈ విషయం మాత్రం ఇన్నాళ్లూ దాచాడంటే అర్థమేమిటీ? ఆ కుటుంబరావు విషయం వాడికీ తెలుసు కనుక, ఈ సంబంధానికి తను ఒప్పుకోడని తెలుసు కనుక! అయినా తనకు మాత్రం పిల్లలు వాళ్లు ఇష్టపడ్డవాళ్లను పెళ్లి చేసుకుని సుఖపడాలని ఆశ లేదా ఏమిటీ? పెద్దమ్మాయి మాలతిని ఎవడైనా కట్నం లేకుండా చేసుకుంటే తనూ తన కొడుక్కు కట్నం తీసుకోకుండా ఉండగలడు. కట్నం తీసుకోని అల్లుడు వస్తాడని కుటుంబరావుకు నమ్మకం ఉందేమోగానీ తనకు అంత గట్టి నమ్మకం లేదు. అదీకాక, అతని కూతురు మంచి ఉద్యోగంలో అయిదంకెల జీతం తీసుకుంటూ ఉంది. అందువలన ఆ అమ్మాయిని ఎవరైనా కళ్లకు అద్దుకొని చేసుకోవచ్చు. తన కూతురు అలా కాదే! డిగ్రీ పూర్తి చేసి అంతటితో చదువు చాలించేసింది. సాధారణమైన ఆ డిగ్రీకి ఉద్యోగమేదీ అంత తేలికగా దొరకదు. అలాంటి అమ్మాయిని చేసుకునేవాడు కనీసం కట్నం అయినా ఎదురుచూడడా!

కట్నం ఇవ్వని కుటుంబరావు కూతురిని చేసుకుంటానని చెప్పలేకే రాఘవ తన దగ్గర ఇంతవరకూ ఆ విషయం చెప్పలేదు. ఇప్పుడు తను వాళ్లిద్దరినీ చూసేశాడు కాబట్టి కుటుంబరావు ద్వారానే తనను కదిలించాలనుకుంటున్నాడు. తను కుటుంబరావుకు ఏం చెప్పాలి? ఎలా ఈ పరిస్థితిని ఎదుర్కోవాలో అర్థంకాక విశ్వనాథ్ పరిపరి విధాలా ఆలోచిస్తున్నాడు.

సెల్‌ఫోను మ్రోగింది.

"హలో" చెవి ఆనించాడు విశ్వనాథ్.

అవతలి వైపు కుటుంబరావు.

"విశ్వం! నీతో మాట్లాడాలని చెప్పాను. తిరిగి ఫోన్ చేయమని చెప్పావు కదా! ఎక్కడ కలుద్దాం. మా ఇంటికి వస్తావా? లేక నేను మీ ఇంటికి రానా?"

విశ్వనాథ్ కొంతసేపు మాట్లాడలేదు.

"కుటుంబం! నేను ఇప్పుడు పని మీద బయటకు వెళ్తున్నాను. తిరిగి రాగానే నేనే ఫోన్ చేస్తాను" అని చెప్పి సమాధానం కోసం ఎదురుచూడకుండా ఫోన్ కట్ చేశాడు.

* * *

ఆఫీసు క్యాంటీన్‌లో విశ్వనాథ్ టీ తాగుతుండగా వచ్చాడు రాఘవ.

"నాన్నా! నీతో మాట్లాడాలి" అన్నాడు.

"తెగించేశాడన్నమాట!" అనుకున్న విశ్వనాథ్ 'ఏమిట్రా?' అన్నట్టు చూశాడు కొడుకు వైపు.

"కుటుంబరావు అంకుల్ ఎన్నిమార్లు ఫోన్ చేసినా నువ్వు మాట్లాడ్డానికి తీరిక లేదంటున్నావట. ఆయన ఏ విషయం మాట్లాడాలనుకుంటున్నాడో అదైనా తెలుసా నీకు?" అన్నాడు రాఘవ కోపంగా.

"పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగుతుంటే ఎవరూ చూడలేదనుకున్నట్టుగా ఉంది. నాకంతా తెలుసు.

కుటుంబరావు నాకు చాలాకాలంగా స్నేహితుడు. అతను కట్నకానుకలకు వ్యతిరేకి. అది తెలిసీ నేను అతనితో ఎలా మాట్లాడాలి? ఇట్లాంటి పరిస్థితి తెచ్చిపెట్టినందుకు నిన్ననాలి. ఇలా నీ దారి నువ్వు చూసుకుంటే నీ చెల్లెళ్ల పెళ్లిళ్లు ఎలా అవుతాయనుకున్నావు? నేను కట్నం కోసం ఎదురుచూసే రాక్షసుడిలా కనిపించవచ్చు మీకు. అయితే నా స్థితిగతుల గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా?" ఆవేశంగా అంటున్న విశ్వనాథ్ మాటలకు అడ్డుకట్ట వేశాడు రాఘవ.

"ఆగు... ఆగు... ఇప్పుడు కట్నాల ప్రసక్తి ఎందుకూ?"

"మరి? నువ్వు ఆ కుటుంబరావు కూతురిని చేసుకుంటే అతను కట్నం ఇస్తాడనుకుంటున్నావా?" కోపంగా అన్నాడు విశ్వనాథ్.

"నేను... కుటుంబరావు కూతురినా... ఏం మాట్లాడుతున్నావు, నాన్నా? జలజను నేను పెళ్లి చేసుకోవడమేమిటి? ఆయన కట్నం ఇచ్చినా నేనా అమ్మాయిని చేసుకోలేను. ఆ అమ్మాయి మా ఆఫీసులో నా కన్నా పై హోదాలో ఉంది. నా కన్నా విద్యాధికురాలు కూడాను"

"అయితే మీరు మాట్లాడాలనుకున్నదేమిట్రా?" తెల్లబోయి అడిగాడు విశ్వనాథ్.

"నాన్నా! అంకుల్ కొడుకు సుధాకర్ తెలుసుగా! అతను మన మాలతిని ఇష్టపడుతున్నాడు. అలాగని వాళ్లిద్దరి మధ్యా ప్రేమ, దోమ అంటూ ఊహించుకోకు. ఆ అబ్బాయి జలజతో తన అభిప్రాయం చెప్పాడు. జలజ ఆ విషయం నాతో చెప్పి మాలతి ఇష్టాన్ని కనుక్కోమంది. అది మాట్లాడ్డానికి మేము కలిసినప్పుడే నీ కంట బడింది. నేను మాలతిని అడిగాను. ఒప్పుకుంది. ఆ తరువాత జలజ వాళ్ల నాన్నగారితోనూ చెబితే ఆయన సంతోషంగా అంగీకరించారుట. ఆయన కట్నం, గిట్నం తీసుకోడని నీకు తెలుసుగా! అందువలన నువ్వూ సులభంగానే అంగీకరిస్తావనుకున్నాం. ఆ విషయం మాట్లాడాలనే ఆయన నాలుగు రోజులుగా నిన్ను కలవాలనుకుంటున్నది. నువ్వేమో ఆయనకు దొరక్కుండా తప్పించుకుంటున్నావు. మాలతికి పెళ్లయిపోతే మన ఇద్దరి సంపాదనతో శాంతికి ఏదో ఒక మంచి సంబంధం కుదుర్చలేకపోతామా..."

విశ్వనాథ్ అప్పటికే సెల్‌ఫోన్ తీసి కుటుంబరావుకు డయల్ చేస్తున్నాడు.

"హల్లో! ఎవరూ? విశ్వమా! నా కొడుకు పెళ్లి విషయంగా సిద్ధాంతిగారితో మాట్లాడ్డానికి వెళ్తున్నానిప్పుడు. తరువాత ఫోన్ చెయ్యి" అని ఫోన్ కట్ చేశాడు కుటుంబరావు అవతలి వైపు.

'బదులు తీర్చుకుంటున్నావా, కుటుంబం!' అనుకొని నవ్వుకుని "రాఘవా! పదరా. కుటుంబరావు ఇంటికి వెళ్దాం" అని ఆఫీసు విషయం కూడా మరిచిపోయి కొడుకును బయలుదేరదీశాడు విశ్వనాథ్.

నవ్వుకుంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు రాఘవ్.

